క్లుప్తంగా

మంత్రి కోమటిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే మందుల సామేల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రికి డ్రై ఫ్రూట్స్‌తో కూడిన పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దొనకొండ రమేష్ ఉన్నారు.

అనుమతులు లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : అనుమతులు లేకుండా సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మెడికల్ మాఫియాకు సహకరించిన డీఎంహెచ్‌ఓ కోటాచలంపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సత్యనారాయణ సేవలు మరువలేనివి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నూతనకల్ : సమాజంలో విజ్ఞానాన్ని పెంపొందించడం కోసం రిటైర్డ్ లెక్చరర్ గునగంటి సత్యనారాయణ చేసిన సేవలు మరువలేనివని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో 6వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, కొనుకుంట్ల సైదులు, పెద్దింటి రంగారెడ్డి, దేసోజు మధు, మండడి భూపాల్‌రెడ్డి, జటంగి వీరమల్లు, బత్తుల వెంకన్న, దగ్గుల మల్లయ్య, పెద్దింటి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల తహసీల్దార్‌గా ప్రకాశ్‌రావు



ప్రకాశ్‌రావు

చివ్వెంల : చివ్వెంల మండల తహసీల్దార్‌గా ప్రకాశ్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జనగామా జిల్లా నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న క్రిష్ణయ్య బదిలీపై సూర్యాపేటకు వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. నూతన తహసీల్దార్‌కు ప్రస్తుతం పని చేస్తున్న తహసీల్దార్ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం తహసీల్దార్‌గా అమీన్‌సింగ్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల తహసీల్దార్‌గా రమావత్ అమీన్‌సింగ్ నియమితులయ్యారు. ఇతను మద్దిరాల మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా అమీన్‌సింగ్ ఇక్కడ విధుల్లో చేరాల్సి ఉంది.

అనాథాశ్రమంలో అన్నదానం

చివ్వెంల : కుడకుడ గ్రామంలోని అనాథ ఆశ్రమంలో శుక్రవారం రాత్రి పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన సాయిరి సంజీవ–ఉజ్వల కుమారుడు సాయిరి జషిత్ భార్గవ్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవీన్, జయమ్మ, వేణు, కిరణ్, తిరుమలేష్, పరందాములు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ గది నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

మద్దిరాల: మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల ప్రాథమిక పాఠశాలలో పీఎంశ్రీ నిధులు రూ.14.50లక్షలతో చేపడుతున్న కంప్యూటర్ ల్యాబ్ గది నిర్మాణ పనులను శుక్రవారం హెచ్‌ఎం సయ్యద్ జహీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఉమారాణి, ఏలేటి శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

ఇంకా పూర్తికాని ధాన్యం కొనుగోళ్లు



ఆత్మకూర్(ఎస్) : పాతర్లపహాడ్ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు



తుంగతుర్తి : కొత్తగూడెంలోని ఐకేపీ కేంద్రంలో..



అర్వపల్లి : రామన్నగూడెంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

- కాంటాలు కాకపోవడంతో కేంద్రాల వద్దే రైతుల పడిగాపులు
- అధికారుల ఆదేశాలు పట్టించుకోని నిర్వాహకులు
- వర్షాలు పడుతుండడంతో ఆందోళనలో అన్నదాతలు

ఆత్మకూర్(ఎస్) : వర్షా కాలం సమీపిస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడి రాశుల అక్కడే దర్శనమిస్తున్నాయి. జిల్లా అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి కాంటాలను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశిస్తున్నారు. అయినా వారి ఆదేశాలు ఎక్కడా అమలుకు నోచుకోవడంలేదు. ఆత్మకూరు మండలంలో దాదాపు పది కేంద్రాలలో 40 నుంచి 70 రాశుల వరకు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మండలంలో గతంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోళ్లు సాగగా ఈ సంవత్సరం ఎక్కువ సంఖ్యలో ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ నిర్వాహకులు అధికారుల సూచనలు పాటించకపోవడంతోపాటు అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు సమాచారం. తమ ఇష్టం ఉన్నవారికి వడ్లను కాంటాలు వేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కేజీలకొద్దీ తరుగు పేరుతో కోత విధిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ఇటీవల మండల వ్యాప్తంగా వర్షాలు పడుతుండడంతో కేంద్రాల వద్ద పోసిన ధాన్యం తడుస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లారీల కొరత..

తుంగతుర్తి : ఐకేపీ కేంద్రాలలో కాంటాలు కాక రైతులు నానా అవస్థలు పడాల్సివస్తోంది. రైతులు తమ ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో పోసి తూర్పార బట్టి తేమ శాతం 16, 17 వచ్చే వరకు ఆరబెట్టి రాసులుగా పోసి ఉంచారు. అయితే వర్షాలు పడుతుండడంతో ధాన్యం రాసులు తడిసి ముద్దవుతున్నాయి.

తుంగతుర్తి మండలంలో 26 కొనుగోలు కేంద్రాలు..

తుంగతుర్తి మండలంలో మొత్తం 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 21 ఐకేపీ కేంద్రాలు, నాలుగు సొసైటీ కేంద్రాలు, ఒకటి డీసీఎంఎస్ కేంద్రం ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారుగా రెండు లక్షల క్వింటాలకు పైగా ధాన్యం కొనుగోలు జరిగి మిల్లులకు పంపడం జరిగింది. సుమారుగా 60 శాతం ధాన్యం కొనుగోలు జరిగింది. మిగిలిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వ ఉండిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై సుమారుగా 50 రోజులు అవుతున్నా ఇప్పటివరకు ధాన్యం ఎగుమతి ఏ మాత్రం పూర్తి కాలేదు. కొన్ని కేంద్రాల్లో సగం ధాన్యం కేంద్రాల్లోనే ఉంది. ఒక కేంద్రానికి రెండు లారీలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఒక లారీ ధాన్యాన్ని దిగుమతి చేసి వచ్చే సరికి కనీసం మూడు రోజులు పడుతోంది. దీంతో రోజుకు ఒక లారీ కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు వాతావరణ పరిస్థితులలో మార్పు రావడంతో ఎప్పుడు వర్షం పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంటాలు త్వరగా అయ్యేలా చూడాలని, లారీల కొరత సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఎగుమతి కావాల్సిన ధాన్యం 16వేల బస్తాలకు పైగానే..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో ధాన్యం కొనుగోళ్లు 25 కేంద్రాల ద్వారా జరుగుతున్నాయి. అయితే ఆయా కేంద్రాలలో కాంటాలు వేసి ఉంచిన 16,253 బస్తాల ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేయాల్సి ఉంది. కాగా లారీల కొరతతో కాంటాలైన బస్తాలు కేంద్రాలలోనే ఉండిపోతున్నాయి. ఇదే సమయంలో వర్షాలు పడుతుడడంతో కాంటాలైన ధాన్యం బస్తాలు తడిసిపోతున్నాయి. మండల వ్యాప్తంగా ఆయా కేంద్రాలలో ఇంకా 2.50లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. కేంద్రాలలో ఉన్న ధాన్యం కొనుగోలు చేయడానికి ఇంకా ఎంతకాలం పడుతుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రోజుకు ఒక లారీ మాత్రమే వస్తుంది



“కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రోజు ఒక్క లారీ మాత్రమే వస్తుంది. మా కేంద్రంలో ఇప్పటివరకు సగం ధాన్యం మాత్రమే కాంటాలు అయ్యాయి. నేను కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 45 రోజులు అవుతోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి.

– జాటంగి గంగయ్య, రైతు, కొత్తగూడెం

నెల రోజులు అవుతోంది



“ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాన్ని తీసుకువచ్చి నెలరోజులు దాటింది. అయినా కాంటాలు కాలేదు. ప్రతిరోజూ కేంద్రం చుట్టూ తిరగడం తప్పడంలేదు. కాంటాలు వేయాలని కోరుతున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పండించిన పంట వర్షానికి తడిసి ఆగమవుతోంది. నాయకులు, అధికారులు ఎవరూ మా బాధలు పట్టించుకోవడంలేదు.

– కట్ట ధనమ్మ, రైతు, పాతర్లపహాడ్

ప్రజల పక్షాన సీపీఎం నిరంతర పోరాటం

సూర్యాపేట అర్బన్ : భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తుందని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌నగర్ 22వ వార్డులో వాడపల్లి వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహాసభల ద్వారా సీపీఐని బలోపేతం చేస్తుంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25న ధర్మభిక్షం భవనంలోని సీపీఐ కార్యాలయంలో సూర్యాపేట పట్టణ 4వ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేవీఎల్ హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం రాజీవ్‌నగర్‌లోని 22వ వార్డుకు సంబంధించి 16 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రెండవసారి వార్డు కార్యదర్శిగా పెండ్ర కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, వాడపల్లి గోపి, వెంకన్న, పెండ్ర నవీన్, బూర మురళి, పెండ్రాల వెంకన్న, శీను పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత మహిళలదే..



నల్ల చెరువు వద్ద మహిళా సంఘం సభ్యులతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్ : చెరువుల ప్రాంతాలలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించే పనులను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించిందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అమృత్ 2.0లో భాగంగా పట్టణంలోని నల్ల చెరువు వద్ద ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువు వద్ద మొక్కలు నాటే ప్రాంతాన్ని మహిళా సంఘం సభ్యులకు చూపించి మార్కింగ్ చేశారు. అనంతరం పట్టణంలోని నర్సరీని సభ్యులతో సందర్శించారు. మొక్కలు ఎలా నాటాలి, ఎలా సంరక్షించాలి అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ ఎం.కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఈ రాజారెడ్డి, మెప్మా టీఎంసీ శ్వేత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత.. ప్రయాణికులకు ఇక్కట్లు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి పిల్లలమర్రి గ్రామానికి వెళ్లే దారిలో మహవీర్ వెంచర్ సమీపంలో వాటర్ పైపు లైన్ కోసం గుంత తీసి వదిలేశారు. అయితే గుంత తీసిన ప్రాంతంలో ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న గుంత

సైబర్ మోసాల బారిన పడొద్దు



మాట్లాడుతున్న షీటీమ్ ఎస్‌ఐ నీలిమ

చివ్వెంల : సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట షీటీమ్ ఎస్‌ఐ నీలిమ అన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై శుక్రవారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీ స్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు వివరాలు, పిన్ నంబర్లు ఎవరికీ చెప్పవద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే 100కు సమాచారం అందించాలన్నారు. యాప్‌లలో వచ్చే అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపవద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. లోన్‌యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పోలీస్ కళాజాత సభ్యులు ఆట–పాట ద్వారా కళాప్రదర్శనలు నిర్వహిస్తూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డీఈఓ అశోక్, ఈఆర్‌పీలు దేవరాజు, క్రాంతి, ఉపేంద్ర, లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది జ్యోతి, ఉమామేశ్వరి, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి



పుష్పాలంకరణలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి



ఆలయ చరిత్ర పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి విశేష పుష్పాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కావడంతో వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకుడు ముడుంబై రఘువరన్ ఆచార్యులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం స్వామి వారికి పుష్పాలంకరణ సేవ ఉంటుందని తెలిపారు. అనంతరం చకిలం సుదర్శన్ రావు రచించిన చెన్నకేశవ స్వామి ఆలయ చరిత్ర (త్రిమూర్తి నివాస క్షేత్రం పిల్లలమర్రి) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉమ్మెత్తల ఆహ్లాదరావు, హరిప్రసాద్, జగన్నాథరావు, వరప్రసాదరావు, చక్రధర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ గూకంటి రాజాబాబు రెడ్డి, కమిటీ సభ్యులు కందకట్ల రాంబాబు, మల్లికార్జున్, శంకర్, గ్రామస్తులు రాపర్తి మహేష్, సోమగాని లింగస్వామి, చెరుకుపల్లి శ్రీనివాస్, గడ్డం వెంకటేశ్వర్లు, సైదులు, తూటిపల్లి సత్తయ్య, అంక భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కాలువల పరిశీలన

తిరుమలగిరి : మండలంలోని మాలిపురం, తొండ గ్రామాలనుంచి వెళ్తున్న 11ఆర్ దేవాదుల ప్రాజెక్టు కాలువను శుక్రవారం ఆర్డీఓ వేణుమాధవ్‌రావు పరిశీలించారు. అనంతరం మాలిపురం, తొండ, కోక్యా నాయక్ తండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తూకమైన బస్తాలను వెంటనే మిల్లులకు పంపాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.హరిప్రసాద్, ఇరిగేషన్ ఏఈ వర్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, మండల సర్వేయర్ అలెన్ జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే ధ్యేయం



సీసీ పనులను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

అర్వపల్లి : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ అనేక పనులు చేయిస్తున్నారని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. కొమ్మాలలో గంగదేవమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో సీసీ నిర్మించాలని యాదవులు ఎమ్మెల్యేను కోరగా వెంటనే స్పందించి రూ.10లక్షలు మంజూరు చేయడంతో ఆ పనులను శుక్రవారం సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండడి పూర్ణచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, కుక్కడపు సైదులు, గంగదెరి శ్రీనివాస్, గంగయ్య, గోవర్ధన్‌రెడ్డి, రామచంద్రు, వీరారెడ్డి, సైదులు, వీరయ్య, సాయిలు, శ్రీరాములు, వెంకటయ్య, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై కాంగ్రెస్ నాయకుల హర్షం



మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే సామేల్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నూతనకల్ : గుండ్లసింగారం బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం బ్రిడ్జి వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాణ సంచాకాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకొని ప్రమాదపు అంచున ఉన్నప్పటికీ గత ప్రజాప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోలేదని అన్నారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మె ల్యే సామేల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, దరిపెల్లి వీరన్న, పసుల అశోక్ యా దవ్, నకిరేకంటి మధు, బండపల్లి సాగర్, చురుకంటి చంద్రారెడ్డి, నకిరేకంటి వెంకన్న, బొడ్డుపల్లి అంజయ్య, బాణాల సుదర్శన్‌రెడ్డి, బంటు బద్రి, గుగులోతు వీరన్న, పులుసు రవి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను సరిచేయరూ..



కొత్తగూడెంలో ఓ రైతు పొలం వద్ద చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

తుంగతుర్తి : కొత్తగూడెం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ వైర్లు చేతికి అందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారాయి. దీంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పొలాల్లో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో అటు నుంచి వెళ్లే రైతులకు, ట్రాక్టర్లకు చాలా ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ తీగలను సరిచేసి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు



నాగారం : బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది



అర్వపల్లి : తహసీల్దార్ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

నాగారం : విధి నిర్వహణలో కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ మారయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్యకు ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు ఎక్కడికి వెళ్లినా ప్రజలకు ఉత్తమ సేవలు అందించి వారి మన్ననలు పొందాలన్నారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యను కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఏఓ కృష్ణకాంత్, ఎంపీఎస్‌ఓ చింతమల్ల రమేష్, మహేశ్వరి, సీసీ గడ్డం గిరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్రీనివాసులుకు సన్మానం

అర్వపల్లి : కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సాండ్ ట్యాక్సీ విధానం విజయవంతం అయ్యేందుకు తహసీల్దార్ శ్రీనివాసులు చేసిన కృషి అభినందనీయమని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల తహసీల్దార్‌గా రెండేళ్లు ఇక్కడ పనిచేసి మఠ్రిగూడ మండలానికి బదిలీపై వెళ్లిన తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులును శుక్రవారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ విధానం వల్ల ప్రజలకు తక్కువ ధరకు ఇసుక దొరకడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్న, గిర్దావర్‌లు ఆర్.జలేందర్‌రావ్, పి.వెంకట్‌రెడ్డి, సిబ్బంది సరిత, మల్లేశ్వరి, అశోక్, సైదిరెడ్డి, ఆగేష్, వెంకటేష్, శ్రీకాంత్, రమేష్, సువర్ణ, ఖమ్మంపాటి సైదులు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ, ఆర్‌పీలు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ బి.బాలునాయక్ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని పీఎస్, యూపీఎస్‌ల ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను పిల్లల తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రీసోర్స్ పర్సన్‌లు జి.దయాకర్, ఎస్.శ్రీనివాస్, ఆర్‌పీలు వి.సైదులు, రమేష్, నాగరాజు, సృజన, శ్రీనివాస్‌గౌడ్, స్వరూపరాణి, వెంకన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు జలాభిషేకం


పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకంఠ మహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు దేవతామూర్తులకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని పుర వీధుల గుండా భక్తులు జలబిందెలతో తరలివెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నేడు విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.



జలబిందెలతో తరలివెళ్తున్న గౌడ కులస్తులు

నిధులున్నా.. మరమ్మతులు సున్నా

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని కొత్తగూడెం రోడ్డు బీటీ రెన్యువల్‌కు నిధులు మంజూరైనా నిష్ప్రయోజనంగా మారింది. అర్వపల్లి నుంచి చాకలిగూడెం మీదుగా కొత్తగూడేనికి 6కి.మీ దూరం ఉంటుంది. అయితే ఈ రోడ్డు బీటీ రెన్యువల్‌కు ఆరేళ్ల కిందట రూ.71లక్షలు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకు పనులు పూర్తిచేయడంలేదు. ఇప్పటికే పలుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు సాగని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ గ్రామ రహదారి పూర్తిగా గుంతలమయమై బీటీ లేచిపోయి పాదచారులు సైతం నడిచివెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామాల ప్రజలు ఈ రహదారిపై వెళ్లడానికి నిత్యం నరకయాతన పడుతున్నారు. వర్షాల కాలంలో అయితే ఈ రోడ్డు మరింత అధ్వానంగా మారుతోంది. ఇప్పటికై నా అధికారులు బీటీ రెన్యువల్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



అర్వపల్లి శివారులో దెబ్బతిన్న రోడ్డు

మద్యం బెల్ట్ దుకాణాలను మూసివేయాలి

మునగాల : మునగాల మండల పరిధిలోని జాతీయ రహదారి–65 పక్కన మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం హైవే వెంట మద్యం బెల్టు దుకాణాలను నిర్వహించే పలువురు దుకాణ యజమానులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. హైవే పక్కన మద్యం బెల్టు దుకాణాలు నిర్వహించడంతో పలువురు వాహనదారులు మద్యం సేవించి ప్రమాదాలకు గురువుతున్నారన్నారు. బెల్టు దుకాణాలలో మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వారితో సంతకాలు తీసుకున్నారు.



మద్యం బెల్ట్ దుకాణాదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్